క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



జెడ్.రాగంపేటలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

గండేపల్లి: మండలంలోని జెడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్, వందన యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పులి ప్రసాద్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ, ఎంఈఓలు నాయక్, స్వామి, బీజేపీ నాయకుడు కొత్తపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు సూర్యనారాయణ, రమేష్, ప్రయాగ రాంబాబు, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని ఆలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిభట్ల సాయి ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

రత్నగిరిపై శంకరునికి రుద్రాభిషేకం

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో శంకరునికి శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా పంచామృతాలతో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. దర్బారు మండపంలో సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవ మూర్తుల చెంతనే మట్టితో తయారు చేసిన 1,133 శివలింగాలకు ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకూ సహస్రలింగార్చన, రుద్రాభిషేకం చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

రుద్రహోమం

రత్నగిరిపై ఆయుష్యహోమ మండపంలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు రుద్రహోమం నిర్వహించారు. శివునికి రుద్రహోమం నిర్వహించిన కారణంగా సత్యదేవునికి లక్ష్మీప్రయోక్త ఆయుష్యహోమం నిర్వహించలేదు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

గోకవరం: స్థానిక సంజీవయ్యనగర్‌లో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. సంజీవయ్యనగర్‌కు చెందిన బాతు ధర్మరాజు ఇంటి నుంచి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అతని కోడలు కుమారి ఇంట్లో ఉండగా మంటలను గుర్తించి బయటకు పరుగులు తీసింది. విషయం గుర్తించిన స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఇంట్లో సామగ్రి మొత్తం కాలిపోయింది. త్వరలో ఇంటి నిర్మాణం చేపట్టడానికి రూ.50 వేలు అప్పు చేసి ఇంట్లో ఉంచానని, ప్రమాదంలో ఈ నగదు కాలిపోయిందని బాధితుడు వాపోయారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు బాధితుల నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

కోటనందూరు: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని టీజే నగరం సర్పంచ్ సుర్ల రాంబాబు అన్నారు. మండలంలోని టీజే నగరం ప్రాథమిక ప్రాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ నాడు–నేడు పనులతో ప్రభుత్వ బడులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులతో పాటు అమ్మఒడితో ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు తరచూ పాఠశాలలను సందర్శించి పిల్లల చదువుపై ఉపాధ్యాయులను ఆరా తీయాలని సూచించారు. ప్రభుత్వం సరఫరా చేసిన స్టీల్ వంటపాత్రలను జగనన్న గోరుముద్ద నిర్వాహకులకు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సురక్షతో ప్రజలకు మెరుగైన వైద్యం

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



పారుపాకలో సురక్ష కిట్లు అందజేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



తామరాడలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

రౌతులపూడి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందుతోందని కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పారుపాకలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం పరితపిస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్లు 375 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో ఎనిమిది మందిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కంటి వెలుగులో భాగంగా 115 మందికి కంటి పరీక్షలు చేసి 113 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ఏఎంసీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వి.భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్ పక్కుర్తి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం

కిర్లంపూడి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. తామరాడ జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ తోట అయ్యన్న అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, కంటి పరీక్షలు, ఈసీజీ, రక్త పరీక్షలను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్య నిపుణులు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారన్నారు. ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు, రోగులకు మందుల కిట్లు అందజేశారు. వైద్యులు సంతోష్, అభిషేక్, దినేష్, నీరజ, శ్రావణి 568 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. మరో 11 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, అడబాల శ్రీను, పెద్దిరెడ్డి లక్ష్మణ్, కాయల వీరబాబు, కాలయ సూరిబాబు, గంధం కాశీ, చదలవాడ బాబీ, దోమాల గంగాధర్, పెంటకోట నాగబాబు, అల్లు విజయ్‌కుమార్, ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు పాల్గొన్నారు.



జగ్గంపేటలో రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



భద్రవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్



బిళ్లనందూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయం: ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

ఏలేశ్వరం: ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని భద్రవరంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామాల్లో 45 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు, పసల నాగేశ్వరరావు, అడపా పార్థసారథి, నీరుకొండ సత్యనారాయణ, చిక్కాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకే లక్ష్యం

జగ్గంపేట: పేదల ఆరోగ్య పరిరక్షణ కోసమే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట సచివాలయం–1 వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి డాక్టర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం, రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, వైఎస్సార్ సీపీ నేతలు కరుటూరి వీర్రాజు, రామన్నదొర పాల్గొన్నారు.

గోకవరంలో...

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజారోగ్యం మెరుగు పడుతోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని గంగంపాలెంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరంలో ప్రజలకు అందుతున్న సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వైద్య సేవలందించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రజలంతా ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నాయకులు దొడ్డి నాగేశ్వరరావు, నరాలశెట్టి నర్సయ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

కోటనందూరు: సగటు పేదవాడికి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ వైద్యం అందిస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని బిళ్లనందూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ బొత్స మంగతో కలిసి ఆయన ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు మందుల కిట్లు అందజేశారు. లోవదేవస్థానం మాజీ చైర్మన్లు లాలం బాబ్జీ, బొంగు ఉమారావు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, ఏఎంసీ రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, మండలాధ్యక్షుడు సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, కోఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు, పార్టీ నాయకుడు బొత్స సత్తిబాబు పాల్గొన్నారు.

సొంతూరులోనే మెరుగైన వైద్య సేవలు

తుని రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు సొంతూరులోనే మెరుగైన వైద్యసేవలను ప్రభుత్వం అందిస్తోందని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. మండలంలోని రాజుపేటలో సర్పంచ్ బుద్దాల సత్తిబాబు అధ్యక్షతన శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులతో కలసి ఆయన వైద్యసేవలను పరిశీలించి సురక్ష కిట్లను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు గింజాల సుబ్రహ్మణ్యేశ్వరీదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు వద్దాది ఏసుబాబు, కిల్లాడ గోవిందు, ఎంపీడీఓ పి.రవికుమార్ పాల్గొన్నారు.

తొండంగి: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని పెరుమాళ్లపురంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పసుపులేటి సతీష్, తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు కొయ్యా మురళి, దడాల విజయ్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, వైస్ ఎంపీపీ–2 యదాల రమణ పాల్గొన్నారు.



పెరుమాళ్లపురంలో రోగులకు కిట్లు అందిస్తున్న వైస్ ఎంపీపీ గంగబాబు



రాజుపేటలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



తునిలో ప్రజలకు మందుల కిట్లను అందజేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

ప్రజలకు మేలు

తుని: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక బ్యాంకు కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. 20 వార్డులకు చెందిన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రోగులకు చైర్‌పర్సన్ సుధారాణి మెడికల్ కిట్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్ర రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ ఎస్‌కే ఖ్వాజా, జెడ్ఆర్‌యూసీ సభ్యుడు బోడపాటి శ్రీను, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- గ్రామాల్లో ప్రభుత్వ భవనాల ప్రారంభం



ఎ.మల్లవరంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

రౌతులపూడి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ఎ.మల్లవరంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, పారుపాకలో వైఎస్సార్ ఆరోగ్య క్లినిక్ భవనాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎ.మల్లవరంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కాకి నాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగా సభలో ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పేదప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రానున్న కాలంలో పథకాలన్నీ కొనసాగాలంటే జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని 350 మందికి ఇంటి పట్టాలు, రైతులకు జగనన్న రీసర్వే పాస్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ఏఎంసీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వి.భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, పార్టీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- రూ.1.26 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకు ప్రారంభం



నీలాద్రిరావుపేటలో మహిళలకు రక్షిత నీరు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: గ్రామాల్లో ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని నీలాద్రిరావుపేటలో జలజీవన్ మిషన్ నిధులు రూ.1.26 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు, పైపు లైన్లు, వాటర్ ట్యాంక్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి రక్షిత తాగునీరు అందిస్తామన్నారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తొలుత గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. గర్భిణులకు పోషకాహార కిట్లు, వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు మందుల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిన్ని వీరబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్, జేసీఎస్ గ్రామ కన్వీనర్లు కాకి శ్రీను, నక్క అబ్బులు, ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు పాము సూరిబాబు, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు పాల్గొన్నారు.

ఓంకార సాధనతో చురుకుదనం



సుమిత్రానంద సరస్వతీ

గండేపల్లి: ఓం కార సాధనతో చదువులో చురుకుదనం ఏర్పడుతుందని కాకినాడ జిల్లా కొప్పవరం ప్రణవ ఆశ్రమం ప్రతినిధి సుమిత్రానంద సరస్వతీ అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో శుక్రవారం ఆమె విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటర్వ్యూలను ఎదుర్కోవడానికి ఓంకార సాధన ఎంతో దోహదపడుతుందన్నారు. ఓంకార సాధనను అలవర్చుకుంటే మనస్సుపై సంపూర్ణ పట్టు సాధించవచ్చన్నారు. అనంతరం ఆదిత్య ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో సుమిత్రానంద సరస్వతిని శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ.విజయ భార్గవ, ఎంబీఏ విభాగాధిపతి ఎం.గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు తాగి మహిళ మృతి

జగ్గంపేట: కడుపు నొప్పి తాళలేక పురుగు మందు తాగి ఓ మహిళ మృతి చెందినట్టు జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని రామవరం గ్రామానికి చెందిన బూసి శిరీష (26) అనే వివాహిత గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఎన్ని మందులు వాడినా తగ్గకపోవడంతో మనస్తాపంతో ఈ నెల 11న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమె జగ్గంపేట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. దీనిపై మృతురాలి తండ్రి అన్నవరం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



ఏలేశ్వరం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



తుని వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబురాజు

ఏలేశ్వరం: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం ఏఓ జ్యోతి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్ రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సలహా మండలి చైర్మన్ గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, సొసైటీ చైర్మన్లు చిక్కాల లక్ష్మణరావు, కొండపల్లి వెంకటేశ్వరరావు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు

తుని రూరల్: రైతులు ఖరీఫ్ ఫలసాయాన్ని విక్రయించుకునేందుకు అనువుగా పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబు రాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏఓ బి.అశోక్‌కుమార్ అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సభ్యుల తీర్మానాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని ఏఓ స్పష్టం చేశారు. నవంబరు నెలాఖరులో పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ పూర్తయ్యిందని, పంట నమోదైన రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, సలహా మండలి సభ్యులు పోతల రమణ, దుంగల నాగేశ్వరరావు, చిటికెల వరహాల బాబు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని నోటీసులు

తుని: పురపాలక సంఘానికి బకాయిలను త్వరగా చెల్లించాలని నోటీసులు జారీ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు శుక్రవారం తెలిపారు. పట్టణానికి చెందిన ఆస్తి, ఖాళీ స్థలాలు, షాపుల అద్దెలను ఈ నెలాఖరు లోగా చెల్లించి సహకరించాలని కోరారు. ఒకవేళ చెల్లించకపోతే పురపాలక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూశాఖ అధికారులు పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు.

దేశంపై గౌరవంతో మెలగాలి



తునిలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఏలేశ్వరంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్

తుని రూరల్: ప్రతిఒక్కరూ దేశం పట్ల గౌరవంతో మెలగాలని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ పి.రవికుమార్ ఆధ్వర్యంలో ఆజాది కా అమృత్ మహోత్సవ్ నిర్వహించారు. నా దేశం, నా మట్టిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి సేకరించిన మట్టి కలశాలతో పాఠశాల విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తునిలో ర్యాలీ నిర్వహించారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబు రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం అమృత కలశ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. అమరవీరుల త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, ఎంపీటీసీ సభ్యులు కొప్పుల బాబ్జీ, పసల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



గొల్లలగుంటలో ఉల్లి కషాయం తయారీపై డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

జగ్గంపేట: రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచించారు. మండలంలోని గొల్లలగుంటలో శుక్రవారం రైతులకు ప్రకృతి సాగు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉల్లి కషాయం తయారీ, వినియోగంన ప్రయోజనాలను వివరించారు. ఉల్లి కషాయం తయారీపై డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.గౌరి, డ్వాక్రా మహిళలు, పాల్గొన్నారు.